**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :

8328649322, 9398236146.



# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 283 | గురువారం 15-05-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.


## క్యాన్సర్ బాధిత కుటుంబానికి అండగా సీఎం

**హైదరాబాద్, మే 14:** క్యాన్సర్ బాధిత కుటుంబాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదుకున్నారు. తక్షణ చికిత్స కోసం లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) కింద రూ.5 లక్షలు అందించగా.. చికిత్స అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద మరో రూ.7 లక్షలను మంజూరు చేశారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో బాధితుడు సాయిచరణ్‌కు రూ.7 లక్షల చెక్కును అందించారు. సిద్ధిపేటకు చెందిన సాయిచరణ్ (35)కు జన్యు మార్పిడి కారణంగా కోటి మందిలో ఒకరికి వచ్చే అరుదైన అక్యూర్డ్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) బారిన పడ్డారు. అతని చికిత్సకు కుటుంబ సభ్యులు సిద్ధిపేట మండలం ఎన్సాన్‌పల్లిలోని తమ ఇంటిని విక్రయించారు. అయినప్పటికీ చికిత్సకు అవసరమైనంత డబ్బులు సరిపోకపోవడంతో సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సీఎం తక్షణ సాయంగా మంజూరు చేసిన రూ.5 లక్షలతో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో సాయిచరణ్‌కు స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ పూర్తయింది. తాజాగా చికిత్సకు అదనంగా వ్యయమైన మరో రూ.7 లక్షలను సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సీఎం రేవంత్ చెక్కును సాయిచరణ్ కుటుంబ సభ్యులకు అందించారు.

# ఇంజనీర్ల పని.. నేతలు చేయొద్దు..

## అలా చేసిన ఫలితమే కాళేశ్వరం ప్రాజెక్టు

- ప్రపంచంలో మూడేళ్లలో కూలింది ఇదొక్కటే
- రాజకీయ నాయకులు చెప్పినట్లు చేస్తే.. ఇంజనీర్లు ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుంది
- ఉద్యోగ నియామకాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం
- గ్రూప్-1పై రాజకీయ ప్రేరేపిత పిటిషన్
- త్వరలో గ్రూప్-1, 2, 3 నియామకాలు: సీఎం
- ఏఈ, జేటీవోలకు నియామక పత్రాలు



**హైదరాబాద్, మే 14:** ఇంజనీర్లు తమ పని తాము చేయాలని, ప్రాజెక్టులు కట్టాలనే విధాన నిర్ణయం మాత్రమే ప్రజాప్రతినిధులు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంజనీర్లు చేయాల్సిన పనిని.. ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రులు చేయకూడదన్నారు. అలా చేయడం వల్ల వచ్చిన ఫలితమే కాళేశ్వరం ప్రాజెక్టు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.వేల కోట్లు పెట్టిన ప్రాజెక్టులకు కనీసం భూభౌతిక పరీక్షలు కూడా చేయలేదని, పెద్దసారు హెలికాప్టర్‌లో పోతూ.. కిందికి చూసి, ఇక్కడొకటి, అక్కడొకటి కట్టమని చెబితే పేపర్‌లో రాసుకొని కాంట్రాక్టర్‌కు ఇచ్చి కట్టించారని ఆరోపించారు. బుధవారం.. కొత్తగా ఎంపికైన 224 మంది అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)లు, 199 మంది జూనియర్ టెక్నికల్ అధికారుల (జేటీవోల)కు జలసౌధలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "శ్రీశైలం, శ్రీరాంసాగర్‌లు సాంకేతిక పరిజ్ఞానం లేనప్పుడే కట్టారు. ఎన్ని ఉపద్రవాలు, వరదలు వచ్చినా ఆ ప్రాజెక్టులు నిటారుగా నిలబడ్డాయి. 22 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిన సాగర్‌కుగానీ, 2009లో సామర్థ్యానికి మించి వరదలు వచ్చినా శ్రీశైలం ప్రాజెక్టుకుగానీ ఏమీ కాలేదు. చెక్కు చెదరకుండా నిలబడ్డాయి. సాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్‌ల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదు. కానీ, కాళేశ్వరంపై సీఎంగా బాధ్యతలు చేపట్టేనాటికి రూ.1.02 లక్షల కోట్లు బిల్లులు చెల్లించగా.. మరో రూ.10 వేల కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయి. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా.. 50 వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు. రూ.1.02 లక్షల కోట్లతో నిర్మించి.. మూడేళ్లలోపే కుప్పకూలిన ప్రాజెక్టు భూప్రపంచంలోనే లేదు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంజనీర్లు సాగర్, శ్రీశైలం, ఉస్మాన్‌సాగర్‌లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎలా కట్టకూడదో అనేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు ఉదాహరణ అని పేర్కొన్నారు.

**భావోద్వేగంతో నడిపించారు..**

నీళ్లు, నిధులు, నియామకాలను భావోద్వేగంగా మార్చి.. రాజకీయం చేసి, రెండుసార్లు ప్రభుత్వాన్ని నడిపించారని బీఆర్‌ఎసనుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పదేళ్లలో కేవలం సాగునీటి ప్రాజెక్టులపై రూ.2 లక్షల కోట్లు ఖర్చుపెట్టారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వాయిదా పడుతూ, నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులు ఒక్కటి కూడా పూర్తి కాలేదంటే.. దీనికి కారణాలేంటో శాఖలో చేరే ఇంజనీర్లు ఆలోచన చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన పదేళ్లలో ఏ ప్రాజెక్టూ పూర్తికాలేదని, కానీ.. రూ.2 లక్షల కోట్లు ఖర్చయ్యాయని విమర్శించారు. నిధులు వరదలా పారాయని, అవి ఎవరి జేబుల్లోకి వెళ్లాయో ఆలోచన చేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికే ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటిపారుదల శాఖను కేటాయించామని, అందుకే ఈ శాఖలో నియామకాల వి షయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు.

## మోదీ అధ్యక్షతన సీసీఎస్ భేటీ



**న్యూఢిల్లీ, మే 14:** ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశం జరిగింది. భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తర్వాత సీసీఎస్ భేటీ కావడం ఇదే తొలిసారి. తాజా భద్రతా పరిస్థితులు, దేశ సన్నద్ధతపై సమావేశంలో చర్చించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. కాగా, మహా దళపతి (సీడీఎస్) అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాధిపతులు బుధవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. మరోవైపు, భారత్–పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ భద్రతను కేంద్రం మరింత పెంచింది. ఇటీవల జరిపిన సమీక్షలో భాగంగా ఆయనకు ప్రస్తుతం కల్పిస్తున్న జెడ్ కేటగిరీ సెక్యూరిటీలో మరో రెండు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను చేర్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## అందాల పోటీల కోసం పేదల ఇళ్లు కూలుస్తారా?

### ఈ చర్యలపై రాహుల్ సమాధానం చెప్పాలి: కేటీఆర్



**హైదరాబాద్, మే 14:** అందాల పోటీల కోసం పేదల ఇళ్లు కూలుస్తారా? ఇదేనా ప్రజాపాలన అంటూ.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అందాల పోటీలో పాల్గొనేవారి పర్యటన కోసం వరంగల్‌లో దారివెంట ఇళ్ల ధ్వంసం అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్ అరాచక పాలనా విధానంపై, అమానవీయ చర్యలపై రాహుల్ గాంధీ స్పందించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదప్రజల జీవితాలు రాక్షస బుల్డోజర్లకింద నలిగిపోవాలా అని ప్రశ్నించారు. పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాగా, ప్రపంచసుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చినవారి కాళ్లను తెలంగాణ మహిళలతో కడిగించడం అభ్యంతరకరమని.. ఇది మొత్తం తెలంగాణ సమాజాన్ని అవమానించినట్లేనని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు.

## టీపీసీసీకి మూడ్రోజుల్లో కొత్త కార్యవర్గం!



**న్యూఢిల్లీ, మే 14:** టీపీసీసీ కొత్త కార్యవర్గ నియామకం ఓ కొలిక్కి వచ్చినట్టు సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం రెండు, మూడు రోజుల్లో నూతన కమిటీని ప్రకటించే అవకాశముంది. బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. కేసీ నివాసంలో సుమారు గంటసేపు జరిగిన సమావేశంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కమిటీలకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు.

## కర్రెగుట్టల్లో 31 మంది మావోయిస్టులు హతం

- ఇప్పటి వరకు 28 మందిని గుర్తించాం..
- కొందరు అగ్రనేతలూ హతమై ఉంటారు!
- నక్సల్స్‌కు లొంగిపోవడం తప్ప దారి లేదు
- సీఆర్‌పీఎఫ్ డీజీ జి.పి.సింగ్,ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ వెల్లడి
- శాంతిని నెలకొల్పుతాం: ప్రధాని
- మార్చి 31 కల్లా నక్సల్స్ రహిత భారత్: షా




**చర్ల, మే 14:** ఛత్తీస్‌గఢ్ –తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో 21 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులను హతమార్చినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టు సమస్య అంతానికి ఇది ఆరంభమన్నారు. బీజాపూర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఆర్‌పీఎఫ్ డీజీ గ్యానేంద్ర ప్రతాప్ (జీపీ)సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్.. కర్రెగుట్టల ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. మావోయిస్టులకు లొంగిపోవడం తప్ప మరో అవకాశం లేదని స్పష్టం చేశారు. కర్రెగుట్టలపై మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో ఏప్రిల్ 21న ఆపరేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. అత్యంత కఠిన పరిస్థితుల్లో బలగాలు కూంబింగ్ చేశాయని, ఆపరేషన్ సాగిన 21రోజుల్లో 21 ఎన్‌కౌంటర్లు జరిగాయని చెప్పారు. అడవుల్లో 450 బీర్ బాంబులు, ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. మొత్తం 31 మంది మావోయిస్టులు చనిపోయారని, ఇప్పటివరకు 28మందిని గుర్తించామని, ఏడుగురి మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని వివరించారు. వీరందరిపై రూ.1.72 కోట్ల రివార్డు ఉందన్నారు. బలగాల దాడిలో చాలా మంది మావోయిస్టులు మృతి చెందారని, సెర్చ్ ఆపరేషన్‌లో మృతదేహాలు దొరుకుతున్నాయని తెలిపారు. మృతుల్లో చాలా మంది కీలక నేతలూ ఉంటారని పేర్కొన్నారు. గుట్టల్లో 214మావోయిస్టు డంపులు గుర్తించామని, 4 ఆయుధ తయారీ ఫ్యాక్టరీలను ధ్వంసం చేశామన్నారు. చనిపోయిన మావోయిస్టుల నుంచి అధునాతన మెషిన్‌గన్స్, ఏకే 47, ఇన్సాస్ తుపాకులు లభించాయని వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో 18 మంది జవాన్లు గాయపడ్డారన్నారు. ఆపరేషన్ కగార్ భవిష్యత్తులోనూ కొనసాగుతుందని తెలిపారు. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తామన్నారు.

# సీజేఐ జస్టిస్ గవాయ్

## ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము

- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు - తొలి బౌద్ధ, రెండో దళిత సీజేఐగా రికార్డు
- 1985లో న్యాయవాదిగా కెరీర్ ఆరంభం - 2003లో హైకోర్టు.. 2019లో సుప్రీం జడ్జిగా..
- ఆర్టికల్ 370 రద్దు, బుల్డోజర్ న్యాయం - తదితర కీలక తీర్పుల్లో భాగస్వామ్యం



**న్యూఢిల్లీ, మే 14:** జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ భారతదేశ 52వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా బుధవారం ప్రమాణం చేశారు. రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ గవాయ్ చేత ఈ మేరకు ప్రమాణం చేయించారు. ప్రమాణం అనంతరం జస్టిస్ గవాయ్ తన తల్లి కమల్‌తాయి గవాయ్‌కి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, జేపీ నడ్డా, అర్జున్‌రాం మేఘ్వాల్, ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, విపక్షనేత రాహుల్‌గాంధీ తదితరులు హాజరయ్యారు. 64 ఏళ్ల వయసున్న జస్టిస్ గవాయ్.. ఈ ఏడాది నవంబరు 23 వరకూ సీజేఐ పదవిలో కొనసాగనున్నారు. కాగా, జస్టిస్ గవాయ్ బౌద్ధమతావలంబకులు. తద్వారా దేశ తొలి బౌద్ధ సీజేఐగా నిలిచారు. అంతేకాదు జస్టిస్ బాలకృష్ణన్ తర్వాత సీజేఐ పదవిని చేపట్టిన రెండో దళితవ్యక్తిగా పేరొందారు. జస్టిస్ గవాయ్ మహారాష్ట్రలోని అమరావతికి చెందినవారు. ఆయన తండ్రి ఆర్‌ఎస్ గవాయ్ సీనియర్ రాజకీయ నాయకుడు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (గవాయ్) పార్టీని స్థాపించి దళిత వర్గాల నేతగా పేరొందారు. 1985లో భూషణ్ రామకృష్ణ గవాయ్ న్యాయవాదిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. 1992–93లో బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌లో ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడర్‌గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. 2000లో ప్రభుత్వ ప్లీడర్‌గా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పదోన్నతి పొందారు. 2003లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005లో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2019 మే24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపొందారు. సీజేఐగా మం గళవారం పదవీ విరమణ చేసిన జస్టిస్ సంజీవ్‌ఖన్నా అదే ఏడాది అదేరోజు సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ గత ఆరేళ్లలో దాదా పు 700 ధర్మాసనాల్లో ఉన్నారు. దాదాపు 300 తీర్పులను స్వయంగా రాశారు. పలు కీలక తీర్పుల్లో ఆయన భాగస్వామి. వాటిలో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చిన ఆర్టికల్ 370ను కేంద్రం రద్దు చేయటానికి సమర్థన, పెద్దనోట్ల రద్దు సబబేనని తీర్పు, ఎన్నికల బాండ్లరద్దు, బుల్డోజర్లతో ప్రభుత్వమే నిందితుల ఇళ్ల ను కూల్చటాన్ని నిలిపివేస్తూ తీర్పు.. ఉన్నాయి. ఇటీ వల అలహాబాద్ హైకోర్టు జడ్జి ఒకరు.. నిందితుడు ఓ మహిళ పైజామా తాడు లాగటం, ఛాతిని తాకటం రేప్ కిందకు రాదంటూ ఇచ్చిన తీర్పును జస్టిస్ గవాయ్ సారథ్యంలోని బెంచ్ నిలిపేసింది. సీజేఐగా ప్రమాణం అనంతరం సుప్రీంకోర్టులో తనను న్యాయవాదులు కలిసిన సందర్భంగా జస్టిస్ గవాయ్.. 'జై భీం' అంటూ వారిని పలకరించారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనల స్ఫూర్తితో 'జై భీం' నినాదం రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. కాగా, సీజేఐగా ప్రమాణం చేయటానికి కొన్ని రోజుల ముందు తన నివాసంలో జస్టిస్ గవాయ్ విలేకర్లతో మాట్లాడుతూ.. సీజేఐగా తనకు రాజ్యాంగమే అత్యున్నత ప్రమాణంగా ఉంటుందని స్పష్టం చేశారు. పదవీ విరమణ తర్వాత ఏ ప్రభుత్వ పదవినీ చేపట్టబోనని చెప్పారు. తాజాగా, రిటైర్డ్ అయిన సీజేఐ సంజీవ్‌ఖన్నా కూడా ఏ పదవీ చేపట్టనని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలి

**ఆయుధాలు వీడటంపై ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోలేం**

**మావోయిస్టు అధికార ప్రతినిధి అభయ్**



**హైదరాబాద్, మే14**

ఆపరేషన్ కగార్ పేరిట దారుణ మారణకాండ కొనసాగుతోందని, దీనికి అడ్డుకట్ట వేస్తూ శాంతిచర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని ఓ లేఖలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ కోరారు. శాంతిచర్చలకు అనుకూల వాతావరణంలో భాగంగా తాము షరతుల్లేని కాల్పుల విరమణకు సన్నద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే ప్రకటన జారీ చేశామని గుర్తు చేశారు. శాంతిచర్చల విషయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, బీఆర్‌ఎస్ నేత కేసీఆర్ బహిరంగసభలో శాంతిచర్చలు కావాలన్న డిమాండ్‌కు లక్షలాది ప్రజలు ఇచ్చిన స్పందన కేంద్రం గమనించాలని కోరారు. తమ పార్టీ నిర్మాణం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉంటుందని ఆయుధాల వీడటంపై తానొడినే నిర్ణయం తీసుకోలేనని, కేంద్రకమిటీ, కోర్ కమిటీ సమావేశమై చర్చ తర్వాత నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వాస్తవ పరిస్థితులు అందుకు అనుగణంగా లేవని కేంద్ర, కోర్ కమిటీసభ్యులు కలవడానికి వీలుగా కాల్పుల విర మణ, శాంతిచర్చల ప్రక్రియ కొనసాగించాలని కోరుకుంటున్నామన్నారు.

# కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు కూడా లెక్క చేయం

**“ ఇసుక” అక్రమ రవాణా ఆపేది లేదు**

**రామన్నగూడెం లో రాత్రి అయితే ట్రాక్టర్ల మోతే**

**అధిక స్పీడు! లౌడ్ స్పీకర్ల హెూరు**

**మామూళ్ల మత్తులో స్థానిక అధికారులు**



**తొవ్వ, నెల్లికుదురు, మే 14**

అయ్యా పెద్ద సారు గ్రామ శివారు ఆకేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ల మోత తో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామంటూ మండలంలోని రామన్నగూడెం ప్రజలు స్థానిక అధికారులైన ఎమ్మార్వో ఎస్ఐలకు ఎన్నిసార్లు చెప్పినచెవిటి వారి ముందు శంఖం ఊదినట్లుగా అవుతుందని గ్రామస్తులు వారి బాధను తెలియజేస్తున్న సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రానికి సమీపంలోని రామన్నగూడెం గ్రామ శివారులో ప్రవహిస్తున్న ఆకేరు వాగు పరివాహక ప్రాంతం నుంచి చుట్టు ప్రక్కల గ్రామాలతో పాటు గ్రామంలోని ట్రాక్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణాను మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతమైన తొర్రూరుకు గత రెండు నెలలుగా యదేచ్ఛగా రవాణా కొనసాగిస్తున్నారు. దీంతో గ్రామంలోని ప్రజలు రాత్రి అయితే అధిక స్పీడుతో వెళ్లే ట్రాక్టర్ల శబ్దాలతో పాటు వాటికి అమర్చిన లౌడ్ స్పీకర్లతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని, ట్రాక్టర్లు వెళు న్న సమయంలో పని మీద బయటకు వెళ్లాలంటే ఎక్కడ ప్రాణాలు పోతాయోనని భయం గుప్పెట్లో వెళ్లలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు స్థానిక అధికారులకు చెప్పి విసిగి వేసారిన ప్రజలు జిల్లా ఉన్నతాధికారులైన కలెక్టర్ ఎస్పీలకు పలుమార్లు ఫోన్లో చెప్పిన పట్టించుకోకపోవడం తో అక్రమ రవాణా దారులు మమ్మల్ని ఎవరేం చేస్తారు. మేంఅధికారుల తో పాటు ప్రజాప్రతినిధులకు నెలవారి మామూల్లు ఇస్తున్నామని వారిఅండదండలు ఉన్నాయని ఇసుక అక్రమ రవాణా దారులు రెచ్చిపోతున్నారు. గ్రామస్తులు ఆపితే వారితో గొడవలకు దిగడంతో పాటు నానా బూతులు తిడుతూ కొట్లాటకు దిగుతున్న సంఘటనలు లేకపోలేదు. ప్రజా ప్రభుత్వం లో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించకపోయినా కనీసం వారి యోగక్షేమాలను పట్టించుకునే నాధుడు లేకపోవడం తో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చెక్ పోస్ట్ లు పెట్టాం అని చెప్పడంతోనే సరిపెడుతున్న అధికారులు తక్షణమే ఇసుక పరివాహక ప్రాంత గ్రామాలలో నిరంతరం నిఘా ఏర్పాటు చేసి వాల్టా చట్టాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో ఇసుక అక్రమ రవాణాను ఆపకపోతే నిరాహార దీక్షలకు దిగుతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేలుకుంటుందా! ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తుందా! వేచి చూడాల్సిందే?

# జనసేనలో 100 మంది చేరికలు

**పార్టీ కండువా కప్పుకున్న లోతుగడ్డ జంక్షన్ గ్రామస్తులు**



**చింతపల్లి తొవ్వ న్యూస్ మే 14 :**

పాడేరునియోజకవర్గం ఇంఛార్జ్ డా. గంగులయ్య సమ క్షంలో జనసేన పార్టీ లో చేరిన యువ నాయకులు కూడా రామకృష్ణ, లోతు గెడ్డ జంక్షన్ గ్రామ యువత చింతపల్లి మండలం పెదబరడ పంచాయితీ లోతుగెడ్డ గ్రామంలో, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్,చింతపల్లి సీనియర్ నాయకులు ఉగ్రంగి లక్ష్మణ రావు ఆద్వర్యంలో జనసేన పార్టీ సమావేశం ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో అరకు పార్లమెంట్,పాడేరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డా, వంపూరు గంగులయ్య ప్రధాన అతిథిగా పాల్గొన్నారు.ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ చైతన్యం దిశగా ఆలోచన చేసే యువత కారణంగా గిరిజన ప్రాంతంలో వేగంగా జనసేన పార్టీ విస్తరిస్తోందని దానికి గల కారణాలు గత ప్రభుత్వం హయంలో స్థానిక వైసీపీ నాయకులు చేసిన పొరపాట్లు అవినీతి పాలన వారి అసెంబ్లీ పోబియలే ప్రధాన కారణమని ఆయన ఎద్దేవా చేశారు.గతంలో గిరిజన నిరుద్యోగ యువతకు తీవ్ర నష్టం జరిగిన జీవో నెంబర్ 3విషయమై వారు చేసిన రాజకీయాలు పసిగట్టలేరని అనుకుంటున్నారేమో నిజానికి వారు ఉపాధ్యాయ ఉద్యోగాలకు పోటీ పడే అభ్యర్థులు వారికి ఈ వైసీపీ కుటిల రాజకీయాల నాటకాలు,డ్రామాలు ,తెలియదనుకుంటే వైసీపీ నాయకులు పొరపాటు పడినట్టే తమ జీవితాల కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ పొగుడుతూ,బానిసత్వం చేస్తూ గిరిజన జాతికి ద్రోహం చేసిన బాపతు మన వైసీపీ గిరిజన నాయకులది ఇటువంటి వారిపై గిరిజన ప్రజలు అవగాహన కలిగి వుండాలని వారు చేసిన మోసం దగా సామన్యమైనవి కావని అన్నారు.ఈ సందర్భంగా వైసీపీ పార్టీ నుంచి కూడా రామ కృష్ణ నాయకత్వంలో లోతుగెడ్డ జంక్షన్ గ్రామాయువత ,గ్రామస్తులు సుమారు 100 మంది ప్రజానీకం పాడేరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డా. వంపూరు గంగులయ్య చేతుల మీదుగా జనసేన పార్టీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో జి.మాడుగుల మండల అధ్యక్షులు మాసాడి భీమన్న, ఐటి ఇంచార్జ్ అశోక్,చిన్ని రాజబాబు, మర్రి నాగేష్, మఠం శ్రీను,కూడా అబ్బాయి దొర,తల్లే మూర్తి,ముదిలి సుబ్బు,సత్యనారాయణ మజ్జి,తదితర జనసైనికులు,మహిళలు పాల్గొన్నారు.

## గ్రామదేవతల కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: మే 14**



రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో గ్రామదేవతల కళ్యాణ మహెూత్సవంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని గ్రామ ప్రజలందరూ భక్తి భావం పెంపొందించుకోవాలని గ్రామదేవతల దీవెనలు వెల్లంకి గ్రామం పై ఉండి గ్రామంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పాడి పంటలు మంచిగా పండాలని గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని వేడుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్, పున్న వెంకటేశం, ఎండి ఆమీర్, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు పున్న వెంకటేశం, పిట్ట మహేందర్ రెడ్డి, నాయకులు ఎడ్ల కృష్ణారెడ్డి, ఎడ్ల రామచంద్రారెడ్డి, వరికుప్పల బాబురావు, పర్ని మాధవరెడ్డి ,ఎడ్ల శ్రీధర్ రెడ్డి, పాశం సతీష్ రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది.

# మే 19న జరుగు సుందరయ్య విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి: సిపిఎం



**యాదాద్రి జిల్లా: వలిగొండ: తోవ్వ ప్రతినిధి: మే 14**

ఈనెల 19వ తేదీన భువనగిరిలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జరుగు సుందరయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం సందర్భంగా జరుగు అమరవీరుల కుటుంబాల ఆత్మీయ సభ ను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు కోరారు.

బుధవారం రోజున మండల పరిధిలోని గోకారం, వలిగొండ గ్రామాల్లో అమరజీవి చెర్క జగన్నాథం,అమరజీవి వేముల మహేందర్ కుటుంబ సభ్యులకు ఆహ్వానాలు అందించిన సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత మొదటి పార్లమెంటు ప్రతిపక్ష నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సిపిఎం జిల్లా కార్యాలయం భువనగిరిలో విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా సిపిఎం ఉద్యమాల్లో పాల్గొని అసువులు బాసిన త్యాగదనుల స్మరించుకునేందుకు,వారి ఆశయాలకు పునరంకితమై వారి స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలకు శ్రీకారం చుట్టేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు,ఈ కార్యక్రమంలో సిపిఎం మండల,జిల్లా కమిటీ సభ్యులు,జిల్లా ప్రజాసంఘాల ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు మరియు ఉద్యమంలో డివిజన్ స్థాయిలో, జిల్లా స్థాయిలో పనిచేస్తూ అమరులైన కుటుంబ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, కూర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కవిడే సురేష్,పార్టీ నాయకులు పబ్బు నారాయణ,వేముల లక్ష్మయ్య, పబ్బు నరసింహ, పబ్బు యాదగిరి, దేశపాక బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి-సిపిఐ



**యాదాద్రి జిల్లా: వలిగొండ: తొవ్వ ప్రతినిధి :మే 14**

వలిగొండ మండలంలోని నర్సాపురం గ్రామంలో శాఖ మహాసభలు ఓర్సు స్వామి అధ్యక్షతన జరిగినది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య పాల్గొని మాట్లాడుతూలిసంస్థగతంగా అన్ని గ్రామాలలో సిపిఐ పార్టీ గ్రామ శాఖలలో మహాసభలు నిర్వహించుకోవడం జరుగుతున్నది. పార్టీ బలోపేతానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయి అని అన్నారు సంస్థగతపరంగా గ్రామ శాఖ మహా సభలు నిర్వహించి. మండల మహాసభలు నర్సాపురం గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నామని అన్నారు.. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆందోళన ఉద్యమాలు చేయవలసిన అవసరం కూడా ఉందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో అన్ని గ్రామ శాఖలలో సర్పంచ్ ,ఎంపీటీసీ జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలని అని అన్నారు. గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలనతో గ్రామాలలో తీవ్రమైన సమస్యలే ఎదురవుతున్నాయి వెంటనే ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం నూతన గ్రామ శాఖ ఎన్నుకోవడం జరిగినది కార్యదరిగా నార్కట్పల్లి మచ్చ గిరి, సహాయ కార్యదర్శిగా ఓర్సు స్వామి, కార్యవర్గ సభ్యులుగా ఎల్లంకి మహేష్ కూరెల్ల దేవేందర్, వడ్డేపల్లి లక్ష్మమ్మ,లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది.

# సమయపాలన పాటించని అధికారులు

**ఉదయం 11:15గంటలు దాటిన వారి జాడే లేదు**

**రిపోర్టర్ కు ఐడి కార్డ్ అడుగుతున్న డిఈఈ పోలిక. గోవర్ధన్**

**తొవ్వ ప్రతినిధి, నర్సంపేట, మే14:**



మాదే ఆఫీసు, మా ఇష్టం వచ్చిన సమయానికి మేము వెళ్తాం, మమ్మీల్ని ఎవరేం చేయలేరు అని ఉదయం 11:15 గంటల సమయం అవుతున్న ప్రభుత్వ కార్యాలయానికి రాణి సంఘటన నర్సంపేట మండలం పర్యవేక్షక ఇంజనీరింగ్ కార్యాలయం, నీటిపారుదల శాఖ సర్కిల్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. కార్యాలయంలో పనిచేస్తున్న సుమారు ఎంతమంది ఉద్యోగులు ఉన్నారో కానీ అందులో ఉన్న ఉద్యోగులు ఒక్కరు కూడా 11:15 గంటలవుతున్న కార్యాలయానికి రాకపోవడం లో కాళీ కుర్చీలు దర్శనం ఇవ్వటంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రవేట్ సంస్థలు పనిచేసే ఉద్యోగులు సమయపాలనతో పాటు తమ విధులను సక్రమంగా నెరవేరుస్తారు. ప్రజలకు సేవ చేయవలసిన ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం సమయపాలన పాటించ కుండా పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంటే దీంట్లో అతిశయోక్తి లేదు. ఇది ప్రభుత్వ కార్యాలయం కదా తమ ఇష్టం వచ్చిన సమయానికి రావచ్చు అన్నది మాలో ఉద్యోగులు ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సమయపాలన పాటించి ఉద్యోగులను గుర్తించి సస్పెండ్ చేయాలని అక్కడ ప్రజలు పై అధికారులను కోరుతున్నారు.

# గ్యాస్ లీకై అగ్నిప్రమాదం కాలి బూడిదైన సామాగ్రి

**చింతపల్లి తొవ్వ న్యూస్**



గ్యాస్ లీకై అగ్నిప్రమాదం జరగగా ఇంటిలో పలు రకాల వస్తువులు కాలి బూడిదైన సంఘటన మండలంలోని లోతుగడ్డ పంచాయితి చెరుకుంపాకలు గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబం అందించిన సమాచారం మేరకు చెరుకుంపాకలు గ్రామానికి చెందిన సుధ కృష్ణ బట్టల వ్యాపారం చేస్తుండగా అతని భార్య లక్ష్మి పార్వతి కుట్టు మిషన్ పనులు చేస్తుంది. బుధవారం వారిద్దరి పెళ్లి రోజు కావడంతో కుటుంబ సభ్యులంతా ఆనందంగా గడిపేందుకు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా పలు రకాల వంటకాలు తయారు చేసేందుకు నిర్ణయించుకొన్నారు. వంట పనులలో సహాయం చేసేందుకు లక్ష్మి పార్వతి వదిన అయిన సంగా గీత సహాయం తీసుకున్నారు. ఇంటి వరండాలో వంట పనులు మొదలు పెట్టిన వారు వంట పనులు పూర్తయ్యేలోగా గుడికి వెళ్లి దర్శించుకొని వద్దామనే ఉద్దేశంతో కుటుంబ సమేతంగా దగ్గరలో ఉన్న శివాలయం దగ్గరకు వెళ్లారు. సంగా గీత వంట పనులు చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు చెలరేగి, ఆ పక్కనే కుర్చీలో ఉన్న బట్టలకు అంటుకున్నాయి. వెంటనే తేరుకున్న ఆమె బయటకు పరుగులు చేసింది. స్థానికులు వచ్చి మంటలను ఆర్పేలోగా అక్కడ ఉన్న సామాగ్రి అంతా కాలి బూడిదైంది. ఇంటిలోని కరంటు వైరింగ్, బయట ఉన్న బట్టలు, విలువైన సామాన్లు అన్నీ కాలిపోయాయి. సంగా గీతకు స్వల్ప గాయాలయ్యాయి. సుమారు 50 వేల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఎరువుల షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే వీరేశం

**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: మే 14**



రామన్నపేట మండల కేంద్రం లో నూతన ఏర్పాటు చేసిన రైతన్న ట్రేడర్స్ ఎరువుల షాపు ను నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం బుధవారం ప్రార భించినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు,అందించి మెరుగైన పంటలు పండిచేలా చూడాలి అన్నారు. ఈ సందర్బంగా ప్రొపరైటర్ నీల ఐలయ్య కు శుభాకాంక్షలు తెలియజేశారు .ఈకార్యక్ర మంలో ఎం ఏ ఓ అలీఖాన్ , మేక అశోక్ రెడ్డి ,అక్రమ్ గారు కర్నాటి లింగస్వామి వహీద్, నాగటి ఉపేందర్, పృథ్వి,చంద్రశేఖర్, మరియు రైతులు నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల

# సంక్షేమ సంఘం జెండావిష్కరణ



**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి :మే 14**

రామన్నపేట సబ్ డివిజన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ , ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మహా బైక్ ర్యాలీని మంగళవారం నిర్వహించారు.మండల కేంద్రంలోని స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద విద్యుత్ ఎస్సీ , ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి శ్యామ్ మనోహర్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ రమేష్ మేడి ముఖ్య అతిథులుగా పాల్గొని రాష్ట్ర అధ్యక్షులు ఆవిష్కరణ,రాష్ట్ర సెక్రటరీ జనరల్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చింతపల్లి సూర్య నారాయణ అధ్యక్షతన జేపీ గార్డెన్ లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ భారత దేశ కార్మిక ఉద్యమానికి, ప్రత్యేకించి నిమ్నజాతి ఉద్యోగుల సముచిత జ్ఞాన ప్రభావితానికి డా? బి. ఆర్. అంబేద్కర్ ఇలా అన్నారు. ప్రతి మానవుడు ఒక మహెూత్తరమైన ఆశయం కోసం జీవిస్తూ తన మేధాశక్తి అంతా అందరికి వినియోగించాలి తన ఆశయం సిద్ధించేంత వరకు శ్రద్ధాశక్తులతో, పట్టుదలతో పనిచేయాలి. అలాంటి కార్యదీక్ష పట్టుదలతోనే ఈనాడు మానవుడు ఎన్నో విజయాలను సాదించగలు గుతున్నాడు. మానవునికి సత్ప్రవర్తన చాలా ముఖ్యం గుణవంతుడు కానివాడెంతటి విద్యావంతుడైనా నిష్ప్రయోజనమే సౌశీల్యతలేని విద్య నిరుపయోగమే. కార్మిక రంగంలో నిమ్న జాతీయులకు ప్రత్యేక సమస్యలున్నవి. అందుచేత వారు ప్రత్యేక సంఘంగా ఏర్పడి తీరాలి. తమ ప్రత్యేక సమస్యలను సంఘం ద్వారా పరిష్కరించుకుంటూ సాధారణ సమస్యలను సహచర సంఘంతో కలిసి పని పరిష్కరించుకోవచ్చు సాంఘీక పరిణామం జరగందే రాజకీయ పరిణామం జరగదు. నిమ్న జాతీయులు నేదు ఎదుర్కొంటున్న సాంఘిక, రాజకీయ, కార్మిక సమస్యల దృష్ట్యా వారు బహుముఖ పోరాటం సాధించాల్సి వుంది మన విజయం మన సంఘటిత శక్తి పైనే ఆధారపడి వున్నది అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే. చంద్రయ్య,రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కే.రవీందర్, కంపెనీ అధ్యక్షులు పి.ఆనంద్ బాబు, కంపెనీ ప్రధాన కార్యదర్శి జి.బీచుపల్లి,వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ, అడిషనల్ సెక్రెటరీ సోమ్లా నాయక్ ,యాదాద్రి భువనగిరి జిల్లా సూపర్డెంట్ ఇంజనీర్ఆర్. సుధీర్ కుమార్,ఎస్ఏఓ కే హరీష్ కుమార్, డిఈ చౌటుప్పల్ డి ఎస్ .మల్లికార్జున్ గౌడ్,డిఈ భువనగిరి ఎస్. వెంకటేశ్వర్లు, రీజినల్ ప్రెసిడెంట్ ఎమ్.ఆర్.రవిందర్,రీజినల్ సెక్రెటరీ బొట్ల రాజేశ్వర్,డివిజన్ సెక్రెటరీ ముత్యాల బిక్షపతి,డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి జంగయ్య, వంగాల మల్లేశం,శ్రీనివాస్,దుర్గయ్య,కే నరసింహ,యం.లింగం,కే. కృష్ణవేణి,డి అశోక్ ,చుక్క భాస్కర్,కే. సైదులు,డి అశోక్ కుమార్,బి కిరణ్,ఈ శ్రీనివాస్, డి .బాబు, ఎం శిరీష తదితరులు పాల్గొన్నారు.

# నా అభిమానులు.. ఇంటికి ఆహ్వానిస్తున్నారు...



అమ్మానాన్న ఒప్పుకోకపోయినా నటనపై ఉన్న అభిమానంతో బుల్లితెరకు పరిచయమైన నటి తన్వియా. కన్నడ, తెలుగు సీరియల్స్‌లో లీడ్ రోల్స్‌తో అలరిస్తున్న తన్వియా సినిమాల్లోనూ నటించింది. చిన్నప్పటి నుంచే డ్యాన్స్ మీదున్న ఇష్టంతో స్టేజ్ షోలు చేసిన తన్వియా సినిమాల్లో బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్‌గా కెరీర్ ప్రారంభించింది. సీరియల్స్‌లో నటించే అవకాశం రావడంతో నటిగా మారిన ఈ కన్నడ బ్యూటీ అటు కన్నడ పరిశ్రమలోనూ ఇటు తెలుగులోనూ వరుస అవకాశాలతో రాణిస్తున్నది. జీ తెలుగులో ప్రసారమవుతున్న 'ఎన్నాళ్లో వేచిన హృదయం' సీరియల్‌లో త్రిపురగా బుల్లితెర ప్రేక్షకులను అలరిస్తున్న తన్వియా జిందగీతో పంచుకున్న ముచ్చట్లు ఆమె మాటల్లోనే.. మాది కర్ణాటకలోని మండ్య. మేం ముగ్గురం అక్కాచెల్లెళ్లం. అక్కలిద్దరి పెళ్లిళ్లయ్యాయి. పెద్దక్కకు నా చిన్నప్పుడే పెళ్లవడంతో తనతో నాకు అనుబంధం తక్కువ. చిన్నక్క, నేను టామ్ అండ్ జెర్రీలా కొట్టుకునేవాళ్లం. మంచి స్నేహితులం కూడా. నిజానికి నా పేరు తన్వియా కాదు. చిన్నప్పుడు లత అని పెట్టారు.

కానీ, స్కూల్లో ఉన్నప్పుడు నా పేరు మార్చుకోవాలనిపించింది. నా స్నేహితురాలు తనకు ఇష్టమని తన్వియా అని నాకు పేరు పెట్టింది. మాది మధ్యతరగతి కుటుంబం. బాల్యం అంత సజావుగా ఏం సాగలేదు. కుటుంబ, ఆర్థిక సమస్యలతో అమ్మానాన్న ఎప్పుడూ గొడవపడుతూ ఉండేవాళ్లు. చదువులో ర్యాంక్ స్టూడెంట్‌ని కాదు కానీ ఫస్ట్‌క్లాస్ స్టూడెంట్‌నే. చదువుకంటే కూడా డ్యాన్స్ అంటే ఎక్కువ ఆసక్తి ఉండేది. అందుకే స్కూల్‌లో, కాలేజీలో నిర్వహించే ప్రతి ప్రోగ్రామ్‌లో తప్పకుండా ప్రదర్శన ఇచ్చేదాన్ని. ఆ ఇష్టమే డ్యాన్స్‌ను కెరీర్‌గా మార్చుకునేలా చేసింది. మా నాన్నకు నేను డ్యాన్స్ చేయడం ఇష్టం ఉండేది కాదు. ఆడపిల్లకు చదువు, ఉద్యోగమే ముఖ్యమని భావించేవారు. అందుకే సినిమాల్లోకి వస్తానంటే ఒప్పుకోలేదు. కానీ, నాన్న మాట కాదని బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్‌గా ఒక టీమ్‌లో జాయినయ్యా.

### దాదాపు వెయ్యికి పైగా స్టేజ్ షో

స్ ఇచ్చాను. సినిమాల్లోనూ డ్యాన్సర్‌గా చేశాను. అప్పుడే కలర్స్ కన్నడలో సీరియల్‌లో నటించే అవకాశం వచ్చింది. అప్పటికే చాలా సినిమాలకు, సీరియల్స్‌కు ఆడిషన్స్ ఇచ్చాను. కానీ, ఎవ్వరూ అవకాశం ఇవ్వకపోవడంతో నమ్మకం కోల్పోయా. నాలుగైదు లుక్ టెస్ట్‌ల తర్వాత 2022లో 'అంతర్పట' అనే కన్నడ సీరియల్లో మొదటి అవకాశం వచ్చింది. అందులో నటించే సమయంలోనే తెలుగు, తమిళ పరిశ్రమల నుంచి కొన్ని అవకాశాలు వచ్చాయి. కానీ, అది పూర్తయిన తర్వాతే ఒప్పుకొందామనుకున్నా. ఆ సీరియల్ పూర్తయిన కొద్దిరోజుల్లోనే జీ తెలుగు నుంచి 'ఎన్నాళ్లో వేచిన హృదయం' సీరియల్‌లో అవకాశం వచ్చింది. కథ వినగానే నచ్చడంతో వెంటనే ఒప్పుకొన్నా. మొదట్లో తెలుగు రాకపోవడంతో చాలా ఇబ్బందిపడేదాన్ని. కానీ టీమ్ సపోర్ట్‌తో త్వరగానే నేర్చుకోగలిగా. స్పష్టంగా మాట్లాడలేకపోయినా తెలుగు అర్థం చేసుకోగలను.

హీరోయిన్ రష్మికా మందన్నా అంటే చాలా ఇష్టం. పుష్ప సినిమాలో ఆమె చేసిన పాత్ర చాలా నచ్చింది. గ్లామర్ కంటే నటనకు ఆస్కారం ఉండే పాత్రల్లో నటించాలనుకుంటున్నా. డ్యాన్సర్‌గానూ రాణించాలనుకుంటున్నా. నాన్న మాట కాదన్నప్పటికీ నాకు నచ్చిన పనిని కెరీర్‌గా ఎంచుకుని విజయవంతంగా రాణిస్తున్నాననే సంతృప్తి ఉంది. అమ్మానాన్నలకు ఎప్పుడూ రుణపడి ఉంటా. స్నేహితులు, బంధువులు అందరూ చాలా ప్రోత్సహిస్తున్నారు. నా బెస్ట్ ఫ్రెండ్ వినోద్. చాలా సపోర్ట్ చేస్తాడు. అభిమానులు ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఈ రోజు నటిగా సంతోషంగా ఉన్నాను. చాలామంది కొన్ని సందర్భాల్లో నా దగ్గరకి వచ్చి నేను చేసిన పాత్రల గురించి చెబుతూ ఏడుస్తూ ఉంటారు. నేను చాలా ఎమోషనల్ అవుతా. అంతగా ప్రేమించే అభిమానులు ఉండటం నిజంగా నా అదృష్టం. ఇంటికి రమ్మని కూడా ఆహ్వానిస్తారు. అలాంటి సందర్భాల్లో చాలా సంతోషంగా ఉంటుంది.

### ప్రపంచం చుట్టేయాలని ఉంది

చిన్నప్పుడు చాలా చలాకీగా ఉండేదాన్ని, కానీ పెరుగుతున్న కొద్దీ ఇంట్లో పరిస్థితుల కారణంగా ఇంట్రావర్ట్‌గా మారిపోయా. ఇప్పుడు మళ్లీ అందరితో కలవడానికి నన్ను నేను మోటివేట్ చేసుకుంటున్నా. ఒంటరిగా ప్రయాణం చేయడం, పుస్తకాలు చదవడం, సినిమాలు చూడటం, ఆదర్శవంతమైన వ్యక్తుల జీవితకథల్ని వినడం ఇష్టం.

కర్ణాటకలో దాదాపు అన్ని పర్యాటక ప్రాంతాలను చూశాను. థాయ్‌లాండ్ కూడా వెళ్లాను. ప్రకృతి అంటే చాలా ఇష్టం. పచ్చని పరిసరాల్లో గడపడం, ట్రెక్కింగ్ అంటే ఆసక్తి. భవిష్యత్తులో అమెరికా, పారిస్‌తోపాటు ప్రపంచమంతా చుట్టేయాలని ఉంది.



# ట్రెండింగ్‌లో బాయ్ కాట్ టర్కీ..

### ఆ దేశం కోసం మన డబ్బులు ఖర్చు పెట్టొద్దన్న నిఖిల్



జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడడం మనం చూశాం. 9 ప్రాంతాల్లోని టెర్రర్ క్యాంప్‌పై మెరుపుదాడులకు దిగిన ఇండియన్ ఆర్మీ వాటిని పూర్తిగా నేలమట్టం చేసింది. దీనికి ప్రతిగా పాకిస్తాన్ సైతం భారత్‌లోని ఎయిర్‌బేస్‌లు, మిలటరీ స్థావరాలపై డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులు చేసే ప్రయత్నం చేసింది. అయితే మన సైన్యం వాటిని గాల్లోనే పేల్చేసింది. ఈ పరిణామాలతో భారత్ – పాకిస్తాన్ మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరుగుతుందేమోనని అంతా భయపడ్డారు. కాని ప్రస్తుతానికి బ్రేక్ పడింది.

అయితే భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో టర్కీ(తుర్కియో) పాక్‌కు మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బాయ్ కాట్ టర్కీ అనే క్యాంపెయిన్ కూడా రన్ అవుతోంది కొంతమంది పండ్ల వ్యాపారులు టర్కీ యాపిల్స్‌ను దిగుమతి చేసుకోవడం మానేశారు. మరోవైపు టర్కీలో భారతీయ సినీ నిర్మాతలు షూటింగ్స్ పెట్టుకోవద్దని ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ అన్ని భారతీయ చిత్ర నిర్మాతలను కోరింది. దీంతో సినిమా షూటింగ్స్ అక్కడ జరగని పక్షంలో ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది. ఇక పలువురు ప్రముఖులు కూడా టర్కీపై తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే హీరో నిఖిల్ కూడా తీవ్రంగా స్పందించాడు. ఓ నెటిజన్ సోషల్ మీడియాలో టర్కీ దేశ అధ్యక్షుడి వీడియోను పోస్ట్ చేయగా, అందులో టర్కీ అధ్యక్షుడు ఎర్దోగాన్ మాట్లాడుతూ.. ఏదేమైనా మేం పాకిస్థాన్ నే సపోర్ట్ చేస్తాం. ఆ దేశంతోనే కలిసి ముందుకు వెళ్తాం అంటూ ప్రకటించాడు. ఆ నెటిజన్ పోస్ట్ ను రీ ట్వీట్ చేసిన నిఖిల్.. 'ఇప్పుడు చెప్పండి ఆ టర్కీ దేశం వెళ్తారా. మన వాళ్లు చాలా మంది ఆ దేశం వెళ్లి అక్కడ భారీగా డబ్బులు ఖర్చు పెడుతున్నారు. అలాంటి దేశం కోసం మనం డబ్బులు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. ఆ దేశం వస్తువులు కూడా మనం వాడొద్దు' అంటూ రాసుకొచ్చాడు నిఖిల్. ప్రస్తుతం నిఖిల్ ట్వీట్‌ని కూడా కొందరు వైరల్ చేస్తున్నారు.

### మెగాస్టార్‌పై జాలి చూపించిన

# నయనతార..

లేడి సూపర్ స్టార్ నయనతార గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఈ అమ్మడికి తెలుగులోను, కోలీవుడ్‌లోను మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. హీరోలకి ధీటుగా పారితోషికం అందుకుంటుంది నయనతారు. మరోవైపు సినిమా ప్రమోషన్స్‌లో పెద్దగా పాల్గొనదు. ఈ మధ్య నయనతార సీనియర్ హీరోల సరసన నటిస్తుంది. పారితోషికం విషయంలో ఏ మాత్రం కాంప్రమైజ్ కాని నయనతార ఇప్పుడు చిరంజీవి కోసం ఓ మెట్టు దిగిందని అంటున్నారు. త్వరలో మెగాస్టార్ చిరంజీవి.. అనీల్ రావిపూడి దర్శకత్వంలో ఓ మూవీ చేయనున్నాడు. సంక్రాంతికి వస్తున్నాం వంటి భారీ కమర్షియల్ సక్సెస్ తర్వాత అనీల్ రావిపూడి చేస్తున్న చిత్రమిది. ఈ చిత్రంలో కథానాయికగా లేడి సూపర్ స్టార్ నయనతారని ఎంపిక చేశారు. అయితే సినిమాకు సంతకం చేసేటప్పుడు కొన్ని కండిషన్స్ పెట్టే అలవాటు నయనతారకు ఉంది. అందులో ముఖ్యమైనది పబ్లిసిటీ ప్రోగ్రామ్స్, ఇంటర్వ్యూలు వంటివి తనకు కుదరవని చెబుతుంది. కాని చిరంజీవి సినిమా కోసం ఓ మెట్టు దిగి ప్రమోషన్‌లో పాల్గొననుందని అంటున్నారు. ఇటీవల చెన్నై వెళ్లిన అనిల్ రావిపూడి%ఔ% నయన్ మీద స్పెషల్ వీడియో షూట్ చేసి వచ్చారు. దీనిని బట్టి ఆమె సినిమా ప్రచార కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉందని అంటున్నారు. ఇక మరో విషయం ఏంటంటే చిరంజీవి –అనిల్ రావిపూడి సినిమా కోసం నయనతార 18 కోట్ల రూపాయల రెమ్యూనరేషన్ డిమాండ్ చేసిందని ఆ మధ్య ప్రచారం జరిగింది. సౌత్ సినిమా ఇండస్ట్రీలో 10 కోట్లకు పైగా రెమ్యూనరేషన్ తీసుకున్న హీరోయిన్‌గా నయన్ రికార్డ్ క్రియేట్ చేశారు. అయితే ఇప్పుడు చిరంజీవి సినిమా కోసం నయనతార కేవలం 6 కోట్ల రూపాయలు తీసుకోవడానికి సిద్ధమైందట. చిరు సినిమా కోసం ఆవిడ స్పెషల్ ఇంట్రెస్ట్ చూపించడం చూసి అందరు ఆశ్చర్యపోతున్నారు. ఇక నయనతార నటించిన చివరి తెలుగు సినిమా గాడ్ ఫాదర్ కాగా, అందులో ఆవిడ సిస్టర్ రోల్ చేశారు. అంతకు ముందు హిస్టారికల్ వార్ డ్రామా 'సైరా నరసింహారెడ్డి' సినిమాలో హీరోయిన్ రోల్ చేశారు.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు
నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :
8328649322, 9398236146.

**తొవ్వ**

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

గురువారం 15 మే 2025 పేజీలు 2

సూర్యాపేట : సూర్యాపేట జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం దారుణంగా పడిపోయింది. ఎప్పుడు ఊపందుకుంటుందో తెలియని పరిస్థితి. జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఉన్నారు. వీరంతా కమీషన్‌తోనే తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కేవలం పట్టణాల్లోనే కాకుండా మండల కేంద్రాల్లో సైతం భూమి విక్రయించే వారికి, కొనుగోలు దారులకు మధ్యవర్తులుగా ఉం టూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఐదారు నెలల నుంచి వ్యాపారం సాగకపోవడంతో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఇతర ఉద్యోగా లు చేయలేక ఖాళీగా ఉండడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి.

సూర్యాపేట జిల్లాలో కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్లలో రియల్ వ్యాపారం కొనసాగుతోంది. అన్నిచోట్ల మందకొడిగా కొనసాగుతుండడంతో ఎక్కువ మందికి ఉపాధి కరువైంది. హైడ్రా హైదరాబాద్‌లో అమలుకావడంతో ఆ ప్రభావం జిల్లావ్యాప్తంగా పడింది. ప్రధానంగా చెరువు కింద భూములు కొనేందుకు జంకుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎసకు అవకాశం ఇచ్చినప్పటికీ కేవలం 30 నుంచి 40 శాతం మంది ఉపయోగించుకున్నారు. అనేక కారణాలతో రియల్ ఎస్టేట్ పడిపోయింది. ?భూముల ధరలు మాత్రం తగ్గలేదు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు మాత్రం భూముల ధరలు తగ్గించి విక్రయిస్తున్నారు.




**- తగ్గిన క్రయ విక్రయాలతో ఏజెంట్ల అవస్థలు - జిల్లా కేంద్రంలోనే 300 మందికి పైగా - సగానికి పైగా రిజిస్ట్రేషన్లు**

# వనమహోత్సవానికి సన్నద్ధం

- నర్సరీల్లో మొక్కలు సిద్ధం
- పకడ్బందీగా చేపట్టేందుకు అధికారుల ప్రణాళికలు
- జిల్లాలో 51 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం



ఆసిఫాబాద్: మే 14: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు.. 11వ విడతలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. వానలు కురవడమే అలస్యం.. మొక్కలు నాటేందుకు డీఆర్‌డీఏ, అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యలయాలు, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్యశాలలు, కళాశాలలు, పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ప్రజలకు, రైతులు అడిగిన మొక్కలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు.

రాష్ట్రంలో పచ్చదనం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగానే ఈఏడాది కూడా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు హరితహారం పేరుతో తొమ్మిది విడతలుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పదో విడతలో వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ సారి 11 విడతలో వన మహోత్సవాన్ని ఉత్సహంగా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో జిల్లా గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో జూలై మొదటివారంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. జిల్లాలో 11వ విడత వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 15 మండలాల్లోని 335 గ్రామపంచాయతీల్లో 51 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు.

# జగ్గారెడ్డి బజార్ల ఉరికించి కొడతాం ,ఖబడ్దార్

- బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి
- హెడ్ లైన్స్ లో ఉండడం కొరకు హెడ్ లేని మాటలు మాట్లాడుతున్న జగ్గారెడ్డి
- జిల్లా మాజీ అధ్యక్షులు రావు పద్మ.-ఫ్రీడం ఫైటర్ల భూములను కొల్లగొట్టిన వ్యక్తి జగ్గారెడ్డి
- మాజీ మేయర్ డా.టి.రాజేశ్వర్ రావు.-క్యారెక్టర్, క్యాలిబర్ ఉన్న వ్యక్తి ఈటల రాజేందర్
- మాజీ ఎమ్మెల్యే వన్నల శ్రీరాములు -అడ్డంగా బలిసి అడ్డదిడ్డంగా మాట్లాడొద్దు. : బీజేపీ రాష్ట్ర నేత కాళీ ప్రసాద్







**హనుమకొండ మే 14 :**
ఈరోజు హనుమకొండ హంటర్ రోడ్ దీన్దయాల్ నగర్ బీజేపీ జిల్లా కార్యాలయంలో బిజెపి హన్మకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పై కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం రోజు విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మాజీ మేయర్ డా. టి. రాజేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే వన్నల శ్రీరాములు,పరకాల నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసిన డా. పగడాల కాళిప్రసాద్, బిజెపి నాయకులు మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ శ్రీరాములు, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు సంద్ర మధు తదితరులు పాల్గొని మాట్లాడారు. కేవలం ఎమ్మెల్సీ పదవి కోసం, మంత్రి పదవి కోసం, పేపర్లో హెడ్ లైన్స్ లో ఉండడం కోసం మాట్లాడం తప్ప ప్రజల ఏరోజు కూడా మాట్లాడని వ్యక్తి జగ్గారెడ్డి అని, పదవుల కోసం, రేవంత్ మెప్పు కోసం, కెమెరాల ముందుకు వచ్చి ఈటల రాజేందర్ ను దుర్భాషలాడుతున్నవారు మొదట తమ నాయకుడు ఇచ్చిన వాగ్దానాల గురించి మాట్లాడాలని హితవు పలికారు. ఇంకోసారి బిజెపి పై బిజెపి నాయకుల పై ఏది పడితే అది మాట్లాడితే బజార్ల ఉరికించి కొడతాం ఖబడ్దార్ అని హెచ్చరించారు. జగ్గారెడ్డి చేసిన వాక్యాలను వెంటనే వెనక్కి తీసుకొని ఎంపీ ఈటెల రాజేందర్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రజల రుణం కార్యకర్తల కష్టాన్ని మర్చిపోను

- కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా..
- 2017కు ముందు నుండి పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీ లో కష్టపడ్డ వారికే బ్లాక్, మండల,గ్రామ అధ్యక్షుల పదవులు
- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి

**ఆత్మకూరు, మే 14 :**
ప్రజల రుణం కార్యకర్తల కష్టాన్ని మర్చిపోనని, కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, 2017కు ముందు నుండి పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీ లో కష్టపడ్డ వారికే బ్లాక్, మండల,గ్రామ అధ్యక్షుల పదవులు లభిస్తాయని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. బుదవారం ఆత్మకూరు మండలం అగ్రహంపాడ్ సమ్మక్క సారలమ్మ గద్దె వద్ద గల జి ఆర్ ఎస్ ఫంక్షన హాల్ లో ఆత్మకూర్, దామెర మండలాల కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు, టీపీసీసీ అబ్జర్వర్ మక్సుధ అహ్మద్ గారు పాల్గొని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల రుణం కార్యకర్తల కష్టాన్ని మర్చిపోను అని,కష్టపడ్డ ప్రతి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. నియోజకవర్గంలో రాబోయే కాంగ్రెస్ పార్టీ కమిటీ కమిట్మెంట్ తో పనిచేసే నాయకత్వాన్ని ప్రోత్సహించండి అని,కాంగ్రెస్ పార్టీయే నా గ్రూపు




అని తెలిపారు. సమర్థ నాయకత్వం ద్వారానే పార్టీ బలోపేతం అవుతుందని,ప్రజలకు కార్యకర్తలకు సేవ చేసే నాయకత్వాన్ని ఎంపిక చేయండి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో పదవైన, ప్రజా ప్రతినిధి పదవి అయినా పార్టీకి ప్రజలకు సేవ చేయాలని, బాధ్యత గా నిర్వహించే నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. గ్రూపులు పెట్టవద్దు అని, కష్టపడ్డా కార్యకర్తకు పార్టీ గుర్తింపు లభిస్తుందని అన్నారు. 2017కు ముందు నుండి పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీ లో కష్టపడ్డ వారికి బ్లాక్ అధ్యక్షులు, మండల, వార్డు,గ్రామ అధ్యక్షులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

# సనాతన హిందూ సేవా సమితి చేయూత

**వరంగల్ సిటీ, మే14 :**
చిన్న వయసు లోనే భర్త చనిపోయి పిల్లల పోషణ మరియు చదువులు ఇబ్బందిగా మారి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న మహిళకు సనాతన హిందూ సేవా సమితి బాధ్యులు చేయూత అందించారు. బుధవారం హన్మకొండ హంటర్ రోడ్ లోని విద్యుత్ నగర్ కు చెందిన చేలిక సునీత కు సమితి నుండి రెండు నెలలకు సరిపడా బియ్యం మరియు నిత్యావసరాలు





అందించారు. సనాతన హిందూ సేవా సమితి నుండి 63వ సేవా కార్యక్రమని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, గ్రూప్ సభ్యులు నోముల మహేష్ బాబు, పడకంటి రామ్ చందర్, మాలోత్ రవి, సత్తు శ్రీకాంత్, గందమళ్ళ సాయి కుమార్, బడుగు రాము, వైట్ల నాగరాజు, మేకల శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ నిర్లక్ష్యం ప్రయాణికులకు ప్రమాదం

**పర్వతగిరి, మే 14:**





వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధి జమాల్ పురం గ్రామం సాయిబాబా మందిరం సమీపాన వరంగల్ నుండి వయా గవిచర్ల అన్నారం రూట్, టి ఎస్ 03 యూబీ 8895 నంబర్ గల ఆర్టీసీ బస్సులో పర్వతగిరి కి వస్తున్న ప్రయాణికులకు ప్రమాదం జరిగింది. బస్సులో వెనక టైర్లపై ఉండే సీట్లలో కూర్చోని వరంగల్ నుండి అన్నారం బయల్దేరి జమాల్ పురం గ్రామానికి దాదాపు మధ్యాహ్నం 3 గంటల సమయంలో వస్తుండగా బస్సు రన్నింగ్ లోనే వెనక టైరు పేలి లోపల కూర్చున్న, హుజూరాబాద్ గ్రామానికి చెందిన మాధవి, గురు ప్రసాద్ అనే ప్రయాణికుల కాళ్లకు బలమైన గాయం తగిలిందని, నూనావత్ బాలు కి స్వల్ప గాయాలు తగిలాయని ప్రయాణికులు తెలిపారు. మెరుగైన వైద్య నిమిత్తం 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం కు తరలించారు. సంఘటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# పూజిత కుటుంబన్ని పరామర్శించిన బిర్ఎస్ మండల నాయకులు



**గణపురం, మే 14:**
గణపురం మండలం కేంద్రంలో మాల నగేష్ భార్య మాల పూజిత దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై పూజిత చిత్రపటానికి నివాళులు అర్పించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీ నరసింహారావు, మండల అధ్యక్షులు మోతె కరుణాకర్ రెడ్డి, యూత్ నాయకులు గాజర్ల చింటూ గౌడ్, మార్క సాయి గౌడ్, వాజిత్, మహేష్, హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన



**గణపురం, మే 14:**
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుసంధానంతో వీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం. సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్స్ బుర్ర సాగర్. కే రామకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు ఆవశ్యకతను బ్యాంకింగ్ ఇన్సూరెన్స్, డిజిటల్ ఫ్రాడ్స్ సైబర్ క్రైమ్స్ పై క్షుణ్ణంగా వివరించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ లు కలిగి ఉండాలన్నారు. ఆ డబ్బులు సంవత్సరానికి ఒకసారి కట్ అవుతున్నాయో. చూసుకోవాలన్నారు. ముందుగా ఎవరు నామిని ఉన్నారో బ్యాంక్ వెళ్లి చూసుకోవాలన్నారు. అంతేకాక సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతాయో సెల్ ఫోన్ ద్వారా ఇష్టం ఉన్న మెసేజ్ లు క్లిక్ చేస్తే ఎంత నష్టం జరుగుతుందో ఈ సందర్భంగా వివరించారు.

తొవ్వ అనుబంధం 15-05-2025

# రామప్ప ఆలయాన్ని సందర్శించిన ప్రపంచ సుందరీమణుల బృందం

**అపూర్వ ఘన స్వాగతం పలికిన జిల్లా యంత్రాంగం**

**గిరిజన సాంప్రదాయ కొమ్ముకోయ నృత్యప్రదర్శనలతో కళాకారుల స్వాగతం**





తొవ్వ , ములుగు, మే -14:
కరేజ్, కాంపాసన్ , కమిట్ మెంట్ తో మహిళలు ముందుకు సాగాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్కఅన్నారు.వరల్డ్ హెరిటేజ్ దేవాలయంగా యునెస్కో వారిచే గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని బుధవారం 35 దేశాలకు చెందిన ప్రతినిధులతో కూడిన ప్రపంచ సుందరీమణుల టీమ్ సందర్శించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ శబరిష జిల్లా అధికారులు, టూరిజం శాఖ అధికారులు ప్రపంచ సుందరీమణుల బృందానికి గిరిజన సాంప్రదాయ కొమ్ముకోయ నృత్య కళాకారుల ప్రదర్శన ద్వారా ఆత్మీయ ఘన స్వాగతం పలికారు. దేవాలయంలోకి చేరుకున్న సుందరీమణుల ఎవరికి వారే స్వయంగా కాళ్లు కడుక్కొని పూజలు చేసేందుకు ఆలయంలోకి వెళ్లారు.



తొవ్వ
15-05-25
సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వ
అనుబంధం



# అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ఎప్పుడు కృషి చేస్తుంది

**కాటమయ్య రక్షణ కవచాలు కిట్స్ పంపిణీ లో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్**




తొవ్వ ,మహబూబాబాద్ ,మే 14:
అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ఎప్పుడు కృషి చేస్తూ ఉంటుందని వారి సంక్షేమం కోసం అధిక నిధులు పథకాలను మంజూరు చేస్తుందని అన్నారు, ఎమ్మెల్యే మురళి నాయక్, బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం గీతా కార్మికుల సంక్షేమం కోసం పూర్తిస్థాయి సబ్సిడీతో అందించే కాటమయ్య రక్షణ కవచం కిట్స్ మహబూబాబాద్ పట్టణంలోనీ మహబూబాబాద్ శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబిసి, అగ్రవర్ణాల పేదలు , ప్రతి ఒక్కరికి ప్రజా సంక్షేమం పై దృష్టి సాధించి వారికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తూ నిత్యం వారి తోడుగా ఉంటుందని అన్నారు,గీతా కార్మికులు వృత్తిలో భాగంగా తాటి చెట్లల నుండి ప్రమాదవశాత్తు పడి చనిపోవడం, అంగవైకల్యం జరగడం తరచూ జరుగుతుందని, అలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో ఈ కాటమయ్య కిట్లను (100) పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ కిట్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని ఆయన కోరారు, ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి, ఎక్సైజ్ సూపర్డెంట్ కిరణ్ కుమార్, ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, గీతా కార్మికులు సంబంధిత విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలన చేతగాక రైతులను బలి తీసుకుంటున్న రేవంత్ సర్కార్ ...

**కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద చనిపోతున్న రైతులు ....**

**గిరిజన రైతన్న కుటుంబానికి ఎందుకింత వివక్ష ...మాజీ మంత్రి దయాకర్**



తొవ్వ ,ప్రతినిధి .మే 13:
పాలన చేతగాక రేవంత్ సర్కార్ రైతులను బలి తీసుకుంటున్నదని ... కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు చనిపోతున్నపట్టించుకోవడం లేదని మాజీ మంత్రి దయాకర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఫైర్ అయ్యారు . బుధవారం కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కుప్పకూలిన అన్నదాత కుటుంబాన్ని పరామర్శించి వారికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు విషయంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేసి కొనుగోలు కేంద్రాల వద్ద చనిపోతున్న రైతుల పరిస్థితి ని వివరిస్తూ వడ్ల కొనుగోలు కేంద్రంలో ఎండ తాకిడికి తట్టుకునేలా టెంట్లు లేవని తాగునీటి సౌకర్యం ఏర్పాటు లేదని తక్షణమే ప్రభుత్వం అధికారులు చర్యలు చేపట్టాలన్నారు . అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే వారి సామజిక వర్గానికి చెందిన రైతు చనిపోతే 5 లక్షల పరిహారం అందించిందని గిరిజన రైతు చనిపోతే ఎందుకు ఇవ్వడం లేదని అన్నారు . 25 లక్షలు ఎక్స్ గ్రేషియా రైతు కుటుంబానికి ఇచ్చి ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు

# కురవిలో చెక్ పోస్ట్ ప్రారంభించిన మహబూబాబాద్ రూరల్ సిఐ సర్వయ్య...



తొవ్వ ,మే 14
జూన్ 6 న బక్రీద్ పండగ సందర్భంగా అక్రమంగా పశువుల రవాణా జరగకుండా ఉండుటకు కురవిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద కురవి పోలీస్ వారి ఆధ్వర్యం లో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో కురవి ఎస్ఐ గంద్రాతి సతీష్, పిఎస్ఐ కృష్ణారెడ్డి, ఏఎస్ఐ వెంకన్న, హెచ్ సి జూనీమియా, కానిస్టేబుల్ లు కాశీరం, హరిబాబు పాల్గొన్నారు.

# డాలర్ హిల్స్ కాలనీలో "హైడ్రా కమిషనర్" పర్యటన



తొవ్వ ప్రతినిధి ,రాజేంద్ర నగర్ ,మే 14:
రాజేంద్ర నగర్ నియోజకవర్గ మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్ హిల్స్ కాలనీలో స్థానికుల ఫిర్యాధు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు పార్కు స్థలం లో నిర్మాణాలు జరుగుతున్నాయని డాలర్ హిల్స్ కాలనీవాసులు హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో బుధవారం పార్కు స్థలం కబ్జాయిన ప్రాంతాన్ని రంగనాథ్ సందర్శించారు.అనంతరం నిర్మాణ దారులు మాట్లాడుతూ పార్కు స్థలం తాము డబ్బులు పెట్టి ల్యాండ్ కొనుగోలు చేసి ప్రభుత్వ అనుమతులు పొంది నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు.

# మండల కాంగ్రెస్ అధ్యక్షా పదవికి మలిశెట్టి వేణు దరకాస్తు



తొవ్వ ,మే 14:
మన్నెగూడెం లో జరిగిన సీరోలు మండలం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశంలో ముఖ్య అతిధిగా ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ పాల్గొన్నారు ..,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు...పాల్గొన్నారు సీరోలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవికోసం మండలఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు. దరకాస్తు చేసుకున్నారు ..




# మైనర్లే ట్రాక్టర్ డ్రైవర్లుగా .... అక్రమ మట్టి రవాణా







**తొవ్వ ,మహబూబాబాద్ ,మే 14:**
మహబూబాబాద్ జిల్లా పర్వతగిరి గ్రామంలో అక్రమంగా మొరం రవాణా యేదేశ్చగా సాగుతుంది 15 సంవత్సరాల లోపు పిల్లలు ఎటువంటి లైసెన్స్ లేకుండా ట్రాక్టర్లను నడుపుతు రోడ్డు పైనే వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు . అడ్డు అదుపు లేకుండా ట్రాక్టర్లు తోలడంతో ఎక్కడ ఎలాటి ప్రమాదం జరుగుతుందో అని పర్వతగిరి గ్రామ ప్రజలు భయకంపితులు అవుతున్నారు 100కు కాల్ చేసిన పోలీసులు,రెవిన్యూ అధికారులు మామూళ్లు తీసుకొని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నా గ్రామస్థులు. ఆవేదన వ్యకతం చేస్తున్నారు ఇది ఇలావుంటే అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగకుండా అడ్డుకుంటామని అధికారులు ప్రజాప్రతినిధులు అంటున్న ఆచరణలో మాత్రం కనబడటం లేదు , జిల్లా కలెక్టర్,ఎస్.పి.ఇతర ఉన్నత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు.కోరుతున్నారు .

## పాలకుర్తి రిజర్వాయర్ పనులను త్వరతగతిని పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే యశస్విని రెడ్డి..



తొవ్వ ,పాలకుర్తి ,మే 14:

పాలకుర్తి రిజర్వాయర్ పనులను త్వరతగతిని పూర్తి చేయాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి..అన్నారు . బుధవారం పాలకుర్తి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్లపై సమీక్ష సమావేశం నిర్వహించి. అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి నెరుగు పాలకుర్తి రిజర్వాయర్ వద్దకు వెళ్లి పరిశీలన చేశారు..ఈ సందర్భంగా రిజర్వాయర్‌లో మిగిలి ఉన్న బ్యాలెన్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభానికి ముందే చిన్న చిన్న పనులను ముగించాలనే ఆదేశించారు రాబోయే వర్షాలకు ముందు రిజర్వాయర్ పనులు పూర్తయితేనే, నీటి నిల్వలు సమర్థంగా వినియోగించుకోవచ్చు. అని ప్రజలకు మేలు కలగాలంటే ఈ పనుల్లో నిర్లక్ష్యం అస్సలు ఉండకూడదన్నారు , ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులూ పాలకుర్తి పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు .

## పాలకుర్తి అభివృద్ధి పరుగులు పెట్టాలి

### వారంలో చెన్నూరు లైనింగ్ పనులు ప్రారంభించాలి..

అధికారులు సమన్వయం తో పనిచేయాలి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



తొవ్వ ,పాలకుర్తి ,మే 13:

పాలకుర్తి అభివృద్ధి పరుగులు పెట్టాలని అధికారులు సమన్వయంతో పనిచేసి అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి అన్నారు బుధవారం పాలకుర్తి శాసనసభ నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షనిర్వహించారు ఈ సమావేశంలో ఇర్రిగేషన్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు..సమీక్ష సందర్భంగా చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్ల పనులపై తక్షణ సమాచారం కోరుతూ, ప్యాకేజ్ 6 కింద జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు..ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెన్నూరు రిజర్వాయర్ లైనింగ్ పనులు ఇంకా ప్రారంభించకపోవడం బాధాకరం అన్నారు. ప్రజల ఆశలు వృథా కాకుండా ఉండాలంటే పనులు వేగంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఒక వారంలోగా చెన్నూరు రిజర్వాయర్ లైనింగ్ పనులు ప్రారంభించాలని . .పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లు స్థానిక ప్రజలకు నీటి సదుపాయాలను కల్పించేందుకు ముఖ్యమైనవని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఝాన్సి రాజేందర్ రెడ్డి గారు పాల్గొని, అభివృద్ధి పనుల పట్ల తన మద్దతును తెలియజేశారు..

## శిక్షణ ద్వారా నైపుణ్యత అభ్యసన సామర్థ్యం పెంపందించుకోవాలి...

### విద్య నైపుణ్యత శిక్షణా తరగతులు పరిశీలించిన, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



తొవ్వ ,ప్రతినిధి ,మే 14:

గుణాత్మక విద్య శిక్షణ ద్వారా విద్యార్థులకు తరగతి గదుల్లో అభ్యాసన భయం పోగొట్టి మరింత మెరుగైన ఫలితాలు, ప్రతిభ చాటుకునేలా విద్యార్థులను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు బుధవారం అనంతరం మోడల్ స్కూల్లో 274 మంది ఉపాధ్యాయులతో జరుగుతున్న ఉపాధ్యాయ నైపుణ్యత శిక్షణ తరగతులను. కలెక్టర్ పరిశీలించి, పలువురు ఉపాధ్యాయులను పాఠశాలలో జరుగుతున్న బోధన అంశాలపై సవివరంగా ప్రశ్నించారు. ఉపాధ్యాయులు ఏ విధంగా పనిచేస్తే మరింత మెరుగైన విద్య అందించవచ్చు అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల విద్యార్థులపై ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలన్నారు.కొత్తగూడ మండలంలోని ఓ పాఠశాల ఉపాధ్యాయిని విద్యార్థులు స్కూల్స్ కు సరిగా హాజరు కాకపోవడంతో గణితం, ఆంగ్ల బాషా నైపుణ్యత సాధించలేకపోతున్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్ గారు మాట్లాడుతూ ఆంగ్ల భాష,గణితం సబ్జక్ట్స్ పై విద్యార్థులకు మక్కువ పెంచేలా చర్యలు తీసుకోవాలని, తరగతి గదుల్లో లెర్నింగ్ లెవెల్ పెంపొందించాలని ప్రత్యేక తరగతులు తీసుకోవాలని తెలిపారు.తెలుగు లాంటి లాంగ్వేజ్ పరీక్షల్లో విద్యార్థులు వెనుక పడకుండా చూసుకోవాలి తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు సాధించిన అత్యుత్తమ ఫలితాలకు అనుసరించిన పద్ధతులు 7,8,9 తరగతులలో అనుసరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడి సత్యనారాయణ,జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, %ూజ+% శ్రీరాములు, ప్రోగ్రాం అధికారులు చంద్రశేఖర్ ఆజాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ఆడపిల్లలే మన భవిష్యత్తు...

## బత్తుల ఫౌండేషన్ వ్యవస్థాపకులు బత్తుల కృష్ణ యాదవ్



తొర్రూర్ ,ప్రతినిధి ,మే 14:
ఆడపిల్లలే మన భవిష్యత్తు... అని వారిని కాపాడుకుంటే మన భవిష్యత్ తరాలకు మార్గదర్శనం లభిస్తుందని బత్తుల ఫౌండేషన్ వ్యవస్థాపకులు బత్తుల కృష్ణ యాదవ్ అన్నారు. బుధవారం మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 14వార్డులో తాను ఇచ్చిన హామీ ప్రకారం (ఆడపిల్ల పుడితే 10వేల రూపాయల డిపాజిట్ ) వార్డులోని భాషబోయిన సాయికుమార్, నందినిల కుమార్తె పేర రూ.10వేల ఫిక్స్ డ్ డిపాజిట్ చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి తాను సంపాదించిన ఆదాయం లో కొంత భాగాన్ని సమాజ సేవ కోసం ఉపయోగించాలని కోరారు. 14 వార్డులో ఏ ఇంట్లో ఆడపిల్ల పుట్టినా తన వంతు సహాయం తప్పకుండా చేస్తానని, ఏ సమస్య వచ్చినా బత్తుల ఫౌండేషన్ దృష్టికి తీసుకువస్తే సత్వరమే స్పందిస్తానని తెలిపారు. సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు లో సరైన నాయకున్ని ఎంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బత్తుల మల్లేశం, గంద్రకోటి కుమార్, రేఖ చంద్రయ్య, పెరుగు పిచ్చయ్య, మంద నాగరాజు, బత్తుల కిరణ్, నందిపాటి రామాచారి, శ్రీను, చెన్నబోయిన యాకయ్య, శంకర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు

# సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా మహాసభల కరపత్రం విడుదల

తొర్రూర్,కేసముద్రం, మే14:
మే 18న కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీ సాయి గార్డెన్లో జరిగే సివిల్ సప్లైహమాలీ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎఐటియుసి మండల కార్యదర్శి మంద భాస్కర్, సిపిఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్ అన్నారు. బుధవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లై హమాలి యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంద భాస్కర్ , చొప్పరి శేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను సంస్కరణ పేరుతో చట్టాలను సవరించి కార్మికుల శ్రమను అప్పనంగా దోచుకునేందుకు కుట్ర పండుతుందన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి కార్మిక హక్కులను కాల రాస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ దానిని అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందని విమర్శించారు. కేసముద్రంలో జరిగే జిల్లా మహాసభలలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యక్రమం రూపొందిస్తామన్నారు. ఈ మహాసభలకు జిల్లాలోని ఐదు ఎం ఎల్ ఎస్ పాయింట్ నుండి హమాలీ కార్మికులతో పాటు ముఖ్య అతిథులుగా ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారథి, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ సారధి రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓమ బిక్షపతి హాజరవుతారన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వద్దే బోయిన లక్ష్మీనరసయ్య, రాజబోయిన శ్రీను, నరముల యాకయ్య, బిచ్చు, రాజు, యాకయ్య, రెంటాల వెంకన్న, నగేష్, తాటికాయల యాకయ్య, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.




**ఫాజిల్ తెలిస్తే మెసేజ్ చేయండి**

**9398236146**

**ఈ తెలంగాణ వీరులు మీకు తెలుసా ...?**



